డైనమిక్
# జనం వాయిస్
RNI NO: TGTEL/26/A0383
తెలుగు దినపత్రిక
ఏప్రిల్ 20, 2026 సోమవారం
DYNAMIC JANAMVOICE
WWW.JANAMVOICE.COM
12 PM
స్పెషల్ ఎడిషన్

# తెలంగాణలో హైవోల్టేజ్ పాలిటిక్స్.

- మేడిగడ్డకు రేవంత్ జగిత్యాల కు కేసీఆర్.
- నేడు పోటాపోటీగా రేవంత్ రెడ్డి, కేసీఆర్ భారీ బహిరంగ సభలు.



**జనం వాయిస్, న్యూస్ డెస్క్:**
నేడు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ బహిరంగ సభలతో రాష్ట్ర రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. జగిత్యాల జిల్లాలో జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరిక సందర్భంగా బీఆర్ఎస్ భారీ బహిరంగసభ నిర్వహిస్తుండగా.. కేసీఆర్ హాజరై కీలక ప్రసంగం చేయనున్నారు. అదే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ సందర్శించనున్నారు. తరువాత సాయంత్రానికి నిర్వహించిన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో బహిరంగసభలో రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నారు.

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో కీలకమైన మేడిగడ్డ బ్యారేజీని సీఎం రేవంత్ రెడ్డి నేడు సందర్శించనున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలంలోని ఈ బ్యారేజీ రెండున్నరేళ్ల క్రితం కుంగిపోవడంతో, ప్రస్తుతం పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (చీణూాా) సూచనల మేరకు సాగునీటి శాఖ చేపడుతున్న బోరు డ్రిల్లింగ్, ఇతర సాంకేతిక పనులను ఆయన స్వయంగా పర్యవేక్షించనున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సమీక్షలో పనుల వేగం పెంచాలని, అవసరమైతే ఇతర రాష్ట్రాల నుండి పరికరాలను తెప్పించాలని అధికారులకు సూచించారు. 2024 ఫిబ్రవరిలో సందర్శించిన తర్వాత, బ్యారేజీ ప్రస్తుత స్థితిగతులను అంచనా వేసేందుకు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించనున్నారు.

నేడు జగిత్యాల జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించనుంది. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన సోమవారం సాయంత్రం 5.30 గంటలకు జగిత్యాలలోని మినీ స్టేడియంలో ఈ బహిరంగ సభ జరుగుతుంది. గతేడాది హనుమకొండలో జరిగిన పార్టీ ఆవిర్భావ దినోత్సవం (బీఆర్ఎస్ రజతోత్సవం) తర్వాత కేసీఆర్ పాల్గొంటున్న భారీ సభ ఇదే. కేసీఆర్ ఈ వేదిక నుంచి బీఆర్ఎస్ శ్రేణులకు ఎలాంటి దిశానిర్దేశం చేస్తారోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సభ ద్వారా పార్టీ మళ్లీ పుంజుకుంటుందని బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

సభకు మరో ప్రధాన ఆకర్షణ కాంగ్రెస్ ను వీడిన సీనియర్ నేత టి. జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారు. దాదాపు 42 ఏళ్ల పాటు కాంగ్రెస్‌లో కొనసాగిన జీవన్ రెడ్డి తన అనుచరులతో కలిసి కేసీఆర్ సమక్షంలో గులాబీ తీర్థం పుచ్చుకోనున్నారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరిక నుండి, పార్టీలో తనకు ప్రాధాన్యత తగ్గడంపై జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ క్రమంలోనే ఇటీవల కేటీఆర్, హరీష్ రావు ఆయనను కలిసి పార్టీలోకి ఆహ్వానించారు. జీవన్ రెడ్డి చేరికతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీఆర్ఎస్ బలోపేతం అవుతుందని పార్టీ భావిస్తోంది.

# గోదావరి ఒడ్డున పేలుడు పరికరాలు.

- బర్లకు తీవ్ర గాయాలు.
- ఆందోళనలో గ్రామస్తులు.



**జనం వాయిస్, జన్నారం, మంచిర్యాల:**
మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని బాదంపల్లి గ్రామ సమీపంలో గోదావరి నది ప్రవాహ ఒడ్డున ఆదివారం ఆందోళనకర ఘటన చోటుచేసుకుంది. వన్యప్రాణులను వేటాడేందుకు గుర్తుతెలియని వేటగాళ్లు పేలుడు పరికరాలు అమర్చినట్లు సమాచారం. గ్రామానికి చెందిన పశువుల కాపరులు తమ బర్లను మేత కోసం గోదావరి తీర ప్రాంతానికి తీసుకువెళ్లగా, మేత కోసం తిరుగుతున్న బర్లలో కొన్ని ఆ పేలుడు పరికరాలను తినడంతో ఒక్కసారిగా పేలుళ్లు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో పలు బర్లకు తీవ్ర గాయాలు కావడంతో కాపరులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. గాయపడిన పశువులను సమీపంలోని వెటర్నరీ వైద్యుల వద్ద చికిత్సకు తరలించారు. ఈ ఘటనతో గ్రామస్థుల్లో భయం నెలకొంది. వేటగాళ్లు వన్యప్రాణుల కోసం ఇలాంటి ప్రమాదకర పేలుడు పరికరాలు అమర్చడం వల్ల నిరపరాధ పశువులు బలవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అటవీ శాఖ అధికారులు, పోలీసు అధికారులు వెంటనే స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇక, ఇదే ప్రాంతంలో మూడు రోజుల క్రితం కూడా ఇలాంటి ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. పేలుడు పరికరాలను తినడం వల్ల నాలుగు మేకలు మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. దీంతో గ్రామ ప్రజల్లో మరింత భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు జన్నారం ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు. బాధ్యుల్ని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# వ్యక్తిపై హత్యాయత్నం



**జనం వాయిస్, అత్తాపూర్:**
అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సులేమాన్ నగర్ లో హత్యాయత్నం జరిగింది. ఫర్నిచర్ షాప్ లో పనిచేస్తున్న రెహాన్ అనే వ్యక్తిని పడుకున్న సమయంలో మరో వ్యక్తి హత్యాయత్నానికి ప్రయత్నించాడు. కత్తితో దాడి చేస్తున్న దృశ్యాలు సీసీటీవీలో రికార్డు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడ్డ రెహానీ స్థానిక ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# డబ్బున్న వారి మైనర్ బాలికలే టార్గెట్

**జనం వాయిస్, హైదరాబాద్:**
జూబ్లీహిల్స్ లో ఇంస్టాగ్రామ్ చీటర్ అరెస్ట్ అయ్యాడు. ఈ మూఠా ఇంస్టాగ్రామ్ లో డబ్బున్న మైనర్ అమ్మాయిలని ట్రాప్ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. విదేశాల్లో ఉంటున్న తల్లిదండ్రుల వారి పిల్లలే ట్రాప్ చేస్తోంది. ప్రముఖ స్కూల్లలో చదువు కుంటున్న విద్యార్థులని టార్గెట్గా ట్రాప్ చేస్తారు. ఇంస్టాగ్రామ్ లో ప్రముఖ పబ్బులలో తిరిగినట్లు పోస్టులు పెడుతుంది. పారిశ్రామికవేత్త పిల్లలని ట్రాప్ చేసి డబ్బులు గుంజుతుంది. మైనర్ ఆడపిల్లలను ట్రాప్ చేసి వీడియోలు ఫోటోలు తీస్తుంది. వీడియో ఫోటోలు



అడ్డం పెట్టుకొని లక్షల రూపాయలు వసూలు చేస్తుంది. ముఠాలోని కీలక సభ్యుని షీ టీమ్స్ అరెస్టు చేసింది.ప్రముఖ పారిశ్రామికవేత్త కూతుర్ని ట్రాప్ చేసి లక్షలు వసూలు చేసింది ముఠా. పారిశ్రామికవేత్త ఇంట్లో పని చేసే పని వాళ్ళని సైతం ట్రాప్ చేసింది. పని వాళ్ళ ద్వారా మైనర్ అమ్మాయి కదలికలను ఎప్పటికప్పుడు తెలుసుకుంది. ప్రముఖ స్కూల్లో చదువు కుంటున్న అమ్మాయిని ట్రాప్ చేసి డబ్బులు కొట్టేసింది. ముఠా నాయకుడు చంద్రశేఖర్ ఆజాద్ కేరాఫ్ అర్జున్,ని జూబ్లీహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# అక్రమ గ్యాస్ రిఫిల్లింగ్ యూనిట్ సీజ్

**జనం వాయిస్, హైదరాబాద్:**
హైదరాబాద్ కమిషనరేట్ పహాడి షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీలో విశ్వసనీయ సమాచార మేరకు పహాడి షరీఫ్ పోలీసులు వినాయక కిరాణా జనరల్ స్టోర్ లో అక్రమంగా డొమెస్టిక్ సిలిండర్ లో నుంచి చిన్న సిలిండర్లలో రీఫిల్ చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి షాప్ నిర్వాకుడు ఏపూరి రాజశేఖర్ 55 ను మరియు ఒక గ్యాస్ సిలిండర్, మూడు చిన్న సిలిండర్లు మరియు వేయింగ్ మిషన్ను సీజ్ చేసిన పోలీసులు, షాప్ యజమాని పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# ఆందోళన కలిగిస్తున్న అగ్ని ప్రమాదాలు

- అప్రమత్తత లోపం పై ఆందోళన.
- పలు రాష్ట్రాల్లో వరుస ఘటనలు.
- ప్రభుత్వ బాధ్యతపై ప్రశ్నలు.
- భద్రతా ప్రమాణాల అమలు ఎక్కడ?.
- ప్రజల్లో అవగాహన పెంపు.
- ప్రమాదాల నివారణకు కీలకం.

**జనం వాయిస్, డెస్క్ ఏప్రిల్ 20:**
దేశవ్యాప్తంగా ఇటీవల వరుసగా జరుగుతున్న అగ్నిప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. పారిశ్రామిక ప్రాంతాలు, గోదాములు, వాణిజ్య సముదాయాల్లో చోటుచేసుకుంటున్న ఈ ఘటనలు భారీ ఆస్తినష్టం కలిగించడమే కాకుండా ప్రజల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ప్రాణనష్టం కూడా సంభవించడంతో పరిస్థితి తీవ్రత మరింత స్పష్టమవుతోంది. తాజా ఘటనల్లో అనేక రాష్ట్రాల్లో అగ్నిప్రమాదాలు చోటుచేసుకోవడం గమనార్హం. మంటలు వేగంగా వ్యాపించడానికి కారణంగా భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, పాత విద్యుత్ వైర్లింగ్, అగ్నిమాపక పరికరాల లోపం వంటి అంశాలు ప్రధాన కారణాలుగా భావిస్తున్నారు. కొన్ని చోట్ల అగ్నిమాపక సిబ్బంది చేరుకునేలోపే మంటలు అదుపు తప్పడంతో నష్టం మరింత పెరిగింది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ బాధ్యతపై ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. అగ్నిసురక్షా నిబంధనలు కచ్చితంగా అమలు చేస్తున్నామా? తనిఖీలు సమయానికి



జరుగుతున్నాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పారిశ్రామిక ప్రాంతాలు, గోదాములు, వాణిజ్య భవనాల్లో నిరంతర తనిఖీలు నిర్వహించి లోపాలను గుర్తించి సరిదిద్దాల్సిన అవసరం ఉంది. కఠిన చర్యలు తీసుకోకపోతే ఇలాంటి ప్రమాదాలు పునరావృతమయ్యే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం మాత్రమే కాకుండా వ్యాపార సంస్థలు కూడా తమ బాధ్యతను గుర్తించాలి. భద్రతా ప్రమాణాలను పాటించడం, అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచడం, సిబ్బందికి శిక్షణ ఇవ్వడం వంటి చర్యలు తప్పనిసరి. ప్రమాదాల సమయంలో ఎలా స్పందించాలో ఉద్యోగులకు అవగాహన కల్పించడం అత్యంత ముఖ్యమైంది. ఇక ప్రజల్లో అవగాహన పెంపు కూడా సమానంగా అవసరం. చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుందనే విషయాన్ని గుర్తించాలి. గ్యాస్, విద్యుత్ పరికరాల వినియోగంలో జాగ్రత్తలు పాటించడం, అనుమానాస్పద పరిస్థితుల్లో వెంటనే సమాచారం ఇవ్వడం వంటి చర్యలు ప్రమాదాలను తగ్గించగలవు. పట్టణాల్లో పెరుగుతున్న జనసాంద్రత, అనియంత్రిత నిర్మాణాలు కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. భవన నిర్మాణంలో భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించకపోవడం వల్ల అగ్నిప్రమాదాలు వేగంగా వ్యాపిస్తున్నాయి. దీనిపై సంబంధిత శాఖలు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అగ్నిమాపక శాఖను మరింత బలోపేతం చేయడం కూడా అత్యవసరం. ఆధునిక పరికరాలు, తగిన సిబ్బంది, వేగవంతమైన స్పందన వ్యవస్థతో ఈ విభాగాన్ని మరింత సమర్థవంతంగా మార్చాలి. అత్యవసర సేవల సమన్వయం మెరుగుపడితే ప్రాణనష్టం, ఆస్తినష్టం తగ్గించే అవకాశం ఉంటుంది. మొత్తంగా చూస్తే అగ్నిప్రమాదాలు కేవలం ఒక సంఘటనగా కాకుండా ఒక హెచ్చరికగా భావించాలి. ప్రభుత్వం, వ్యాపారులు, ప్రజలు కలిసి పనిచేస్తేనే ఈ సమస్యను సమర్థంగా ఎదుర్కొనవచ్చు. భద్రతా ప్రమాణాల అమలు, అవగాహన పెంపు, సమయానుకూల చర్యలు తీసుకుంటే ఇటువంటి ఘటనలను నివారించడం సాధ్యమే. ప్రతి అగ్నిప్రమాదం ఒక పాఠంగా మారాలి. అప్రమత్తతే రక్షణ అనే విషయాన్ని గుర్తుంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మన ప్రాణాలు, ఆస్తిని కాపాడుకోవచ్చు.

